క్లుప్తంగా

నెన్నెల తహసీల్దార్‌గా శ్రీనివాస్

నెన్నెల: నెన్నెల తహసీల్దార్‌గా పి.శ్రీనివాస్ నియమితులయ్యారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌ను తహసీల్దార్‌గా నియమిస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జ్యోతిప్రియదర్శిని ఈ నెల 5న గుండెపోటుతో మృతి చెందారు. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

మాక్ పోలింగ్



ఓటు వేసేందుకు క్యూలో విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక మోడల్ స్కూల్లో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓటు వేసే పద్ధతి, ఈవీఎంల వినియోగం, పోటీచేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ ఎన్నికల్లో ఈవీఎంలకు బదులుగా ట్యాబ్‌లతో పోలింగ్ నిర్వహించారు. పాఠశాలను నాలుగు హౌజ్‌లుగా విభజించి హౌజ్ కెప్టెన్‌ను ఎన్నుకున్నారు. హెడ్ బాయ్స్, హెడ్ గర్ల్స్‌ను నియమించారు. మాక్ ఎన్నికలను పాఠశాల సోషల్ డిపార్ట్‌మెంట్, టీచర్లు పర్యవేక్షించినట్లు ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలిపారు. కార్యక్రమంలో సోషల్ డిపార్ట్‌మెంట్ టీచర్లు శ్రీనివాస్, పి.శ్రీనివాస్, సుమ, శోభ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

చెన్నూర్: ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు గుదిబండగా మారిన పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జోడు మధు అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఎంఆర్సీ ఎదుట పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో మహావాది దత్తకుమార్, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు దేవసాని కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, పుట్ట శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

బెల్లంపల్లి/జన్నారం: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలీందర్ అలీఖాన్, భారత కమ్యూనిస్టుపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి అన్నారు. సీపీఐ తెలంగాణ నాల్గో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం జన్నారం ప్రెస్‌క్లబ్‌లో, బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆగస్టు 20 నుంచి 22వరకు హైదరాబాద్‌లో ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మేధావులు కార్మిక కర్షకులు, విద్యార్థులు, ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తిరుపతి, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, నాయకులు మహేందర్‌రెడ్డి, మామిడి విజయ్, బెల్లంపల్లిలో బీకేఎంయూ జాతీయసమితి సభ్యుడు అక్కెపల్లి.బాపు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి బి.తిలక్ అంబేద్కర్, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు డీఆర్ శ్రీధర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రాజేష్, భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోశం, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఐబీ చౌరస్తాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నవతరం స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవటం శోచనీయమని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సంక్షేమ హాస్టళ్ల బాట పడితే సమస్యలు తెలుస్తాయన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాతమంచిర్యాల: జిల్లాలోని ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల అవుట్‌సోర్సింగ్ వర్కర్లకు ఏడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ క్షితిజ, డిప్యూటీ డైరెక్టర్ ఉషారాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతీ నెల జీతాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. హాస్టల్ వర్కర్ల యూనియన్ నాయకులు సంపత్, సునీత, రాజేష్, రేవతి, సంజయ్ రాజేశ్వరీ, మల్లేశ్వరీ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



జిల్లా కేంద్రంలో కాజ్‌వేపై పారుతున్న వరద నీరు

- ఉప్పొంగిన రాళ్లవాగు
- లోతట్టు ప్రాంత ప్రజల్లో ఆందోళన

మంచిర్యాలటౌన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు కాజ్‌వేపై వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో కాజ్‌వే నుంచి ప్రజలు వెళ్లకుండా పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. పవర్‌సిటీ, రంగంపేట్, ఆండాళమ్మ కాలనీకి వెళ్లే ప్రజలు పాతమంచిర్యాల, ఎంసీసీ నుంచి తిరిగి వెళ్లాల్సి వస్తోంది. బుధవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో వరద కొంత మేర తగ్గినా, వాతావరణశాఖ హెచ్చరికలతో మంచిర్యాల నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజల్లో భయాందోళన నెలకొంది. మూడేళ్లుగా ఏటా వర్షాకాలంలో వరద నీటితో లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడంతో, ఈ ఏడాది భారీ వర్షాల నేపథ్యంలో వరదలో మునిగే ప్రాంతాల్లోని కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాళ్లవాగు ఉప్పొంగితే వరద ముప్పు పొంచి ఉండగా, సమీపంలోని కాలనీ ప్రజలకు ముప్పు పొంచి ఉంది. రాళ్లవాగు వరద నీరు సమీప కాలనీలకు చేరకుండా కరకట్ట నిర్మాణ పనులను ఈ పాటికే ప్రారంభించాల్సి ఉన్నా, ఆ ప్రక్రియ ఆలస్యంతో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

'తుతుంగా' ఉధృతంగా..



కోటపల్లి: మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తుతుంగ వాగులో వరదనీరు చేరి ఉధృత్తంగా ప్రవహిస్తుంది. మత్తడి పోయడంతో ఎదులబంధం వెళ్లే ప్రధాన దారిలో అటవీప్రాంతంలో రోడ్డు పక్క నుంచి వరద నీరు ఉధృత్తంగా ప్రవహిస్తుంది. తుతుంగ వాగులో వరద ఉధృతికి చాపలు అధికంగా రావడంతో గ్రామస్తులు చేపల వేటలో బిజీబిజీగా గడిపారు.

శ్రీలంక చుట్టూ వరదనీరు



జన్నారం: మండలంలోని పొనకల్ శ్రీలంక కాలనీలో బుధవారం కురిసిన భారీ వర్షంతో కాలనీ చుట్టూ నీరు చేరింది. రోడ్లపై వరద పారి రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లలోకి నీరు చేరింది.

బెల్లంపల్లిలో....



నిండుగా ప్రవహిస్తున్న రాంనగర్ వాగు



గాంధీనగర్ ఇళ్లలో వచ్చి చేరిన వరద నీరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము వరకు దంచి కొట్టిన వానకు వాగులు, వంకలు, మురికినీటి కాలువలు పొంగి ప్రవహించగా 165.0మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి రాంనగర్ వాగు పొంగి పొర్లింది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం ప్రమాదకరంగా తయారైంది. అశోక్ నగర్ బస్తీ నుంచి రాంనగర్ బస్తీకి వెళ్లే రోడ్డు, రాంనగర్ బస్తీ నుంచి హన్మాన్‌బస్తీకి వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు మీదుగా వరద నీరు పరవళ్లు తొక్కింది. రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలో వరద నీరు వచ్చి చేరి పురప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాంనగర్, రైల్వే రడగంబాల బస్తీల్లో వరదనీటి ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ రమేశ్ పర్యటించి జేసీబీతో వరద నీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ కుమార్‌దీపక్ వరద ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు.

పొంగిపొర్లిన చెరువులు.. ఉప్పొంగిన వాగులు



తెగిన ఖర్జీభీంపూర్ చెరువు

భీమిని: భారీ వర్షంతో భీమిని, కన్నెపల్లి మండలాల్లో చెరువులు నిండిపోయి మత్తడులు దూకాయి. వాగులు ఉప్పొంగడంతో సమీప పంటలు నీట మునిగాయి. బుధవారం కురిసిన భారీ వర్షంతో ఖర్జీభీంపూర్ గ్రామ పరిధిలోని చెరువు తెగిపోవడంతో ఆయకట్టు పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

తాండూర్‌లో...



కిష్టంపేటలో ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద వరద నీరు



తాండూర్ రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద...

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు నిండుగా ప్రహించాయి. 174.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కల్వర్టుల మీదుగా వరద నీరు పొంగి ప్రవహించగా చెరువులు, కుంటల మత్తళ్ల నుంచి పరవళ్లు తొక్కింది. గంటల కొద్ది ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పలు గ్రామాల్లోని ఇళ్లలో వరద నీరు వచ్చి చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బోయపల్లి ఎస్సీ కాలనీ పూర్తిగా జలమయమయ్యింది. కాలనీలోని అంతర్గత రోడ్లపై నీటి ప్రవాహం పోటెత్తింది. ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరడంతో జన జీవనానికి తీవ్ర విఘాతం కలిగింది. ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ వెంటనే స్పందించి జేసీబీని తెప్పించి వరద నీటి మళ్లింపు చర్యలు చేపట్టారు. అచ్చులాపూర్ గ్రామం ఆటోస్టాండ్ ఏరియాలో వరద ప్రవాహం గట్టు నానయ్య, పొట్లపల్లి రాజయ్య ఇంట్లోకి చేరడంతో ఇరు కుటుంబాలు తెలవారుజాము వరకు బిక్కుబిక్కుమంటూ గడిపాయి. రేచిని పంచాయతీ పరిధి గజ్జలపల్లి, బారేపల్లి, అచ్చులాపూర్, గంపల పల్లి, గోపాల్‌నగర్ గ్రామ శివా రు ప్రాంతాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహించడంతో జనజీవనం స్తంభించింది. కొత్తపల్లి వారసంత ప్రాంతంలో, తాండూర్ కేజీబీవీ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వరదనీటితో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పంటపొలాలన్నీ జలమయమయ్యాయి.

వేమనపల్లిలో...



అసంపూర్తి వంతెనపై నుంచి పారుతున్న వరద

వేమనపల్లి: మండలంలో చామనపల్లి వాగు అసంపూర్తి వంతెనపై నుంచి వరద ప్రవహించింది. నీల్వాయి ప్రాజెక్టు వరద నీటితో నిండి మత్తడి దుంకింది. కొత్తపల్లి వాగులో వరద పోటెత్తి సమీప పంట పొలాల్లో వరినార్లు నీట మునిగాయి. ఎంచపాయ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వందలాది ఎకరాల పత్తి చేళ్లు నీట మునిగాయి. వరద తీవ్రత ప్రాంతాలను ఎంపీడీవో కుమారస్వామి, డీటీ సాయికృష్ణ, ఆర్ఐ కాలిక్ పరిశీలించారు.



నెన్నెలలో కొట్టుకుపోయిన ఎర్రవాగు వంతెన



కొట్టుకుపోయిన ఎర్రవాగు తాత్కాలిక వంతెన

నెన్నెల: మండలంలో మంగళవారం రాత్రి 10గంటల పాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. లంబాడితండా ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించడంతో తాత్కాలిక వంతెన నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. దీంతో నూతన పనులు జరుగుతున్న వంతెనపై నుంచి అతికష్టంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు బైక్‌లపై అవతలి ఒడ్డుకు దాటగలిగారు. ఆటోలు, వాహనాలు దాటే పరిస్థితి లేక అవతలి వైపు ఉన్న ఎనిమిది గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. జోగాపూర్, కోణంపేట, నెన్నెలలో ఇళ్లలో నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినట్లు, రాత్రంతా బిక్కు బిక్కుమంటూ జాగారం చేయాల్సి వచ్చిందని ప్రజలు పేర్కొన్నారు. వాగు పరివాహక ప్రాంతాల్లో ఉన్న పంటలు కొట్టుకుపోయాయి. వరి పొలాలు నీట మునిగాయి. చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలపడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దండేపల్లిలో...



దండేపల్లి: మండలంలో మంగళవారం జోరుగా వాన కురిసింది. చెరువులు, కుంటలు నిండుకుండలా కనిపించాయి. వాగులు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచాయి. 54.4 సెం.మీ. వర్షపాతం నమోదయ్యింది.

భీమారం ఐటీడీఏ నర్సరీలో చెట్లకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారి సందీప్

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం సమీపంలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీలో వివిధ చెట్ల నరికివేతకు బుధవారం వేలం నిర్వహించగా రూ.7,05,000 లక్షల ఆదాయం వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారిని ఖుష్బూ తెలిపారు. ఉద్యాన నర్సరీలో గల మామిడి, సపోట చెట్లను ఒక మీటరు ఎత్తులో నరికి, మళ్లీ అంటు కట్టనున్నట్లు ఆమె తెలిపారు. నర్సరీలోని వివిధ రకాల చెట్ల ద్వారా వచ్చిన ఆదాయంతో నర్సరీని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. తొమ్మిది మంది వ్యాపారస్తులు వేలంలో పాల్గొనగా, భీమారంకు చెందిన ఆకుదారి బాపు అత్యధికంగా ధరపెట్టి చెట్లను దక్కించుకున్నట్లు తెలిపారు. వేలంలో ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి నర్సయ్య, ఉద్యాన అధికారి సందీప్, మంచిర్యాల గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్, ఐటీడీఏ పరిపాలన అధికారి దామోదర స్వామి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్ పాల్గొన్నారు.

నియామకం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా కేకే ఓసీలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అరకొండ అంజనేయులును ఐఎన్‌టీయూసీ యూనియన్ మందమర్రి ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బుధవారం యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నియామకపు పత్రం అందించారు. కార్మికుల హక్కుల సాధన కోసం యూనియన్ తరుపున తన వంతు పోరాటం సాగిస్తానని, తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు జనక్‌ప్రసాద్, ఇతర నాయకులకు ఆంజనేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'నిబద్ధతతో పనిచేస్తే లక్ష్యం చేరుకుంటాం'



బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

కాసిపేట: ప్రతీ ఉద్యోగి నిబద్ధతతో తనకు కేటాయించిన పనిని చేస్తే అనుకున్న లక్ష్యం చేరుకుంటామని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 1గని పై బుధవారం మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా జీఎం దేవేందర్ సభ్యులతో కలిసి గనిని సందర్శించి మొదటి, రెండో, మూడో షిఫ్టులలో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత సాధించిన లక్ష్యాలు, భూగర్భ, ఓపెన్ కాస్టు గనుల్లో యంత్రాల వినియోగం, సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ, ఆర్థిక విషయాలను వివరించారు. భవిష్యత్ ప్రణాళికలు, కంపెనీ ముందున్న సవాళ్లు, లక్ష్యాలు సాధించడానికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్ఓటు జీఎం విజయ్‌ప్రసాద్, డీజీఎం ఈఅండ్‌ఎం బాలాజి భగవతి ఝా, డీజీఎం ఎఫ్ఏ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎస్ఈ కిరణ్‌కుమార్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



రామకృష్ణాపూర్: ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

జైపూర్/రామకృష్ణాపూర్: మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు అన్నారు. మాదకద్రవ్య విముక్త భారత్ పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం మందమర్రి జీఎం కార్యాలయంలో, జైపూర్‌లో వేర్వేరుగా అవగాహన సమావేశాలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువతే కాకుండా విద్యార్థులు కూడా అలవాటుపడుతున్నారని దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మత్తు పదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఓటు జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బొంగోని శంకర్, వోఅండ్ఎం చీఫ్ నరసింహారావు, ఏజీఎంలు మురళీధర్, స్వామిరాజు, మహేందర్, అజాజుల్లాఖాన్, కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

రామకృష్ణాపూర్: సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్న 12మంది ఉద్యోగులు మందమర్రి ఏరియా నుంచి ఉత్తమ ఉద్యోగులు గా ఎంపికయ్యార ని ఏరియా జీఎం దేవేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో కాసిపేట-1 గనికి చెందిన కోల్‌కట్టర్ కార్మికుడు పాలవేని అంకుల్ ఉత్తమ సింగరేణీయన్‌గా ఎంపికై ఆగస్టు 15న కొత్తగూడెంలో సంస్థ సీఎండీ బలరాంనాయక్ చేతులమీదుగా సన్మానం పొందుతారని తెలిపా రు. మిగిలిన 11మంది ఉద్యోగులు షేక్ ఇస్మాయిల్ జనరల్ అసిస్టెంట్ శాంతిఖని, బి.శ్రీనివాస్, హెడ్‌ఓవర్‌మెన్ శాంతిఖని, బియ్యాల వెంకటేశం, టిండాల్ కాసిపేట-1, కన్నోజు నాగేశ్వర్‌రావు సీనియర్ మైనింగ్ సర్దార్ కాసిపేట-1, కట్ట ఉదయ్‌మోహన్ ఫిట్టర్ కాసిపేట-2, తిరుపతి, జనరల్ అసిస్టెంట్ కాసిపేట-2, ము రుకుంట్ల మల్లేష్, కోల్‌కట్టర్ కేకే-5, కదలి సత్యనారాయణ, ఎస్‌డీఎల్ ఆపరేటర్ కేకే-5, పూస ల ప్రకాశ్, ఈపీ ఆపరేటర్ కేకే ఓసీ, కవటం సు రేష్, ఎలక్ట్రిషియన్ కేకే ఓసీ, రాపోలు శ్రీనివాస్, వెల్డర్ ఆర్‌కేపీ సీహెచ్‌పీలకు స్థానిక జీఎం కార్యాలయంలో సన్మానం ఉంటుందని తెలిపారు.

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో విధులు నిర్వర్తిస్తున్న జోగు పర్శయ్య ఉత్తమ సింగరేణీయన్‌గా ఎంపికయ్యారు. కాగా ఆగస్టు-15న సీఎండీ బలరాం చేతుల మీదుగా కొత్తగూడెంలో నిర్వహించే వేడుకల్లో ప్రశంసాపత్రం అందుకోనున్నారు. ఎస్టీపీపీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కుమురం శ్రీనివాస్, ఎండీ.అమీనుల్లా ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసాపత్రాలు అందుకోనున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీష్ రాజ్

బెల్లంపల్లిరూరల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ రికార్డులు, పరిసరాలు, మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకునే ముందస్తు రక్షణ చర్యలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించి మన్ననలు పొందాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎన్‌సీడీ, మహిళ ఆరోగ్య క్లినిక్ లను సమవర్ధవంతంగా చేపడుతూ గర్భిణులు, మహిళలకు వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీహెచ్‌సీలో సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని, గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయా అంశాల పై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యాధికారి టి.ఇవాంజెలిన్, వైద్య సిబ్బంది సునీత, జమున, సాగర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్

కోటపల్లి: 108, 102 అంబులెన్స్ సర్వీసులను వినియోగించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వాహనంలో పనితీరు, వైద్యపరికరాలు, అత్యవసర సమయంలో వినియోగించే మెడికల్ కిట్లు, ఉండాల్సిన మందులు, వాటి పనితీరు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో 18 అత్యవసర అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో అత్యధిక వర్షాల కారణంగా రోడ్డు సౌకర్యం సక్రమంగా లేని గ్రామాల్లోని గర్భిణులు అమ్మ ఒడి వాహనాల ద్వారా ముందుగా చేరుకోవాలని కోరారు. జిల్లా అంబులెన్స్ వాహనాల కార్యనిర్వహణాధికారి సంపత్, కోటపల్లి, వేమనపల్లి వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయజెండా ఆవిష్కరించి, దేశ భక్తిని చాటుకోవాలని తెలపడంతో జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజు తన ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించారు.